సాక్షి
కుమురంభీం

గురువారం । 11 । మే । 2023



కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు

రెబ్బెన మండలం నక్కలగూడ, చింతలమానెపల్లి మండల కేంద్రంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.

9లో▸

ప్రశాంతంగా ప్రవేశపరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం బుధవారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కన్వీనర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఆరో తరగతి నుంచి 8వ తరగతిలో ప్రవేశానికి మొత్తం 1,524 మంది విద్యార్థులకు 1,368 మంది హాజరయ్యారు. 156 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాజేశం తనిఖీ చేశారు.

గరిష్టం/కనిష్టం
42.1/26.4

వాతావరణం

ఆకాశంలో కొంత మేర మేఘాలు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

19లోగా అభ్యంతరాలు తెలపాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంలో ఖాళీగా ఉన్న రేడియాలజిస్ట్(పురుషులు) పోస్టు ప్రొవిజినల్ లిస్టును https://asifabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీసీహెచ్ డాక్టర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 19 సాయంత్రం 5 గంటలలోగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



జిల్లా కేంద్రంలో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

ఆసిఫాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె బుధవారం 13వ రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో ఆందోళనలు కొనసాగించారు. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి శ్రావణ్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు కార్తీక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని సన్మానిస్తున్న గ్రామస్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం గోలేటి పంచాయతీ పరిధిలోని అమీన్‌గూడ సమీపంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు జెడ్పీ చైర్‌పర్సన్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, సర్పంచ్ పోటు సుమలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, టీబీజీకేఎస్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకంలో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి అవినీతికి పాల్పడిన అధికార పార్టీ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావు డిమాండ్ చేశా రు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేశవ్‌రావు మాట్లాడుతూ వసూలు చేసిన నగదును తిరిగి లబ్ధిదారులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకాన్ని అవినీతిమయంగా మార్చిన ఎమ్మెల్యేపై హైకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, సాగర్, విజయలక్ష్మి, పార్వతి, నరేశ్,విజయ్, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో మన స్థానం 30

- జిల్లాలో 76.36 శాతం ఉత్తీర్ణత నమోదు
- ఫలితాల్లో బాలికలదే పైచేయి
- ఎనిమిది పాఠశాలల్లో వందశాతం ఫలితాలు

సాక్షి, ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో కుమురంభీం జిల్లా 30వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 76.36 శాతం మంది విద్యార్థులు ఈ ఏడాది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది జిల్లా 32వ స్థానంలో నిలవగా.. ఈ ఏడాది కొంత మెరుగైన స్థానం సాధించింది. జిల్లాలోని 169 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏప్రిల్ 3 నుంచి 11 వరకు జరిగిన పరీక్షలకు 6,628 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 5,061 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,567 మంది పరీక్ష తప్పారు. ఈ ఏడాది కూడా ఉత్తీర్ణతలో బాలుర కంటే బాలికలే ముందున్నారు. 3,047 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా.. 2,215 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత 72.69 శాతంగా నమోదైంది. 3,581 మంది బాలికలు పరీక్షలు రాయగా.. 2,846 మంది పాసయ్యారు. 79.48 శాతం అమ్మాయిలు ఉత్తీర్ణత సాధించారు.

జూన్ 14 నుంచి సప్లిమెంటరీ..

జూన్ 14 నుంచి 22 వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.

మారిన పరీక్ష విధానం..

గతంలో పదో తరగతి పరీక్షలు సాధారణంగా 11 పేపర్లకు నిర్వహించేవారు. ఈ ఏడాది ఆరు పేపర్లతోనే నిర్వహించారు. పది పరీక్షల్లో ఎక్కువ మంది విద్యార్థులు గణితం, సైన్సులో తప్పారు. కొత్త విధానంతో పలువురు గందరగోళానికి గురయ్యారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం జిల్లాలో ప్రత్యేక తరగతులు నిర్వహించినా ఆవేమీ ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయయాయి.

వెనుకబడిన 'కెరిమెరి'

జిల్లాలో కెరిమెరి మండలం ఫలితాల్లో వెనుకబడింది. ఇక్కడ 340 మంది పరీక్షకు హాజరుకాగా కేవలం 147 మంది మాత్రమే ఉత్తీర్ణత(43.23 శాతం) సాధించారు. పెంచికల్‌పేట్ మండలంలో 56శాతం, చింతలమానెపల్లి మండలంలో 58.77 శాతం ఉత్తీర్ణత నమోదైంది.



వందశాతం ఉత్తీర్ణత సాధించిన తిర్యాణి మండలంలోని రొంపల్లి ఆశ్రమ పాఠశాల

ఇక్కడ సెంచరీ కొట్టారు..

జిల్లాలో 8 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో ఆశ్రమ పాఠశాలు రొంపల్లి(తిర్యాణి మండలం), కోహినూర్(సిర్పూర్- యూ), కంచనపల్లి(లింగాపూర్) ఉన్నాయి. తిర్యాణి, లింగాపూర్ కేజీబీవీల్లో సైతం వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే రెబ్బెన మండలం కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌తోపాటు సాయి విద్యాలయం, అన్నపూర్ణ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

అదిబా తెహ్రీమ్‌కు 9.8 జీపీఏ

జిల్లా కేంద్రంలోని బజార్‌వాడి కాలనీకి చెందిన అదిబా తెహ్రీమ్ 9.8 జీపీఏ సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఆమె తండ్రి రహీం ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తెహ్రీమ్ ఏడో తరగతి నుంచి జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుకుంటుంది. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని తెహ్రీమ్ 'సాక్షి'కి తెలిపారు.



అదిబా తెహ్రీమ్

ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణం

- ఇంటర్ టాపర్లకు కలెక్టర్ హేమంత్ బోర్కడే అభినందనలు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్ వార్షిక ఫలితాల్లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఐఈవో శ్రీధర్ సుమన్‌తో కలిసి టాపర్లను అభినందించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో చదవాలని సూచించారు. అలాగే జిల్లా కేంద్రంలోని జిల్లా మాధ్యమిక విద్యాధికారి కార్యాలయంలో డీఐఈవో శ్రీధర్‌సుమన్ ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన దీపిక బిస్వాస్(985), త్రిష(984), సంధ్యారాణి(981), యశశ్రీ(976), సుప్రియ (971), పవన్ కల్యాణ్(969)కు స్వీట్ తినిపించి అభినందించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పొందవచ్చని పేర్కొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్



యశశ్రీని అభినందిస్తున్న కలెక్టర్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- 'మన ఊరు- మన బడి' పనులపై సమీక్ష

ఆసిఫాబాద్: మన ఊరు- మన బడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలివిడతలో ఎంపికైన పాఠశాలను వచ్చే విద్యాసంవత్సరం తొలిరోజునే ప్రారంభించాలన్నారు. మండల విద్యాధికారులు పనుల పురోగతి నివేదికను రూపొందించాలని సూచించారు. తదుపరి నిర్వహించే సమావేశానికి పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు.

త్వరలో రెండో విడత 'టీచ్ ఇన్ ఆసిఫాబాద్'

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉండే పిల్లల కోసం త్వరలో రెండో విడత టీచ్ ఇన్ ఆసిఫాబాద్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిరమిడ్ ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో 3 నుంచి 16 ఏళ్లలోపు పిల్లల్లో సృజనాత్మకత, గణిత సామర్థ్యాలు పెంపొందించేందుకు వేసవి సెలవుల్లో టీచ్ ఇన్ ఆసిఫాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలరోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో సర్పంచులు, పటేళ్లు, దేవారీలు, కటోడాలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులతోపాటు విధిగా హాజరు కావాలని సూచించారు. సమావేశంలో పిరమిడ్ ఫౌండేషన్ ప్రతినిధి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, హాజరైన అధికారులు

దొంగల హల్‌చల్.. ఖాకీలకు సవాల్

కౌటాల మండల కేంద్రంలోని ప్రగతి కాలనీకి చెందిన దుర్గం గోపాల్ ఇంట్లో ఏప్రిల్ 13న పట్టపగలే చోరీ జరిగింది. గోపాల్ కౌటాలలో ఓ ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తుండగా, ఆయన భార్య ఏఎన్ఎంగా పనిచేస్తున్నారు. ఇద్దరూ విధులకు వెళ్లడంతో రెక్కీ చేసిన దొంగలు ఇంట్లో చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించినా దొంగలు ఇప్పటివరకు పట్టుబడలేదు.





సిర్పూర్(టి)లో విచారణ చేపడుతున్న పోలీసులు (ఫైల్)



కౌటాలలో పగలగొట్టిన బీరువా

- జిల్లాలో వరుస చోరీలతో ప్రజల్లో కలవరం
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- పట్టపగలే రెచ్చిపోతున్న కేటుగాళ్లు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో వరుస చోరీలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వేసవి సెలవులు కావడంతో వ్యాపారులు, ఉద్యోగులు సొంతిళ్లకు పయనమయ్యారు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుంటున్న దొంగలు రెక్కీ నిర్వహించి పగటిపూటే చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు నిత్యం నిఘా పెడుతున్నా చోరీలకు అడ్డుకట్టపడటం లేదు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

వరుస ఘటనలు..

ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరుస ఘటనలు కలవరం సృష్టించాయి. గత నెలలో కౌటాల, సిర్పూర్(టి) మండల కేంద్రాల్లో దొంగతనాలు జరిగాయి. ఏప్రిల్ 20న సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో గల ధనలక్ష్మి జువెల్లరీ షాపులో చోరీ జరిగింది. దుండగులు దుకాణం షెట్టర్‌ను పగులకొట్టి 31 తులాల బంగారం, 12 కిలోల వెండితోపాటు రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ నెల 4న వాంకిడి మండల కేంద్రంలో పట్టపగలే దొంగలు ఇంటికి కన్నం వేశారు. 9 గ్రాముల నల్లపూసల బంగారం తాడుతోపాటు రూ.45 వేల నగదు దోచుకెళ్లారు.

రెచ్చిపోతున్న దొంగలు

మే నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాలు అధికంగా ఉన్నాయి. దీంతో ఇంటిల్లిపాది పెళ్లిళ్లు, ఫంక్షన్లను ఊర్లకు వెళ్తున్నారు. ఇదే అదనుగా భావించిన చోరులు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో అధికంగా దొంగతనాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఉన్నా ప్రయోజనం ఉండటం లేదు. సిర్పూర్(టి) జువెల్లరీ షాప్ వద్ద జరిగిన చోరీలో దుండగులు ముందుగానే సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం దొంగలకు కలిసివస్తోంది. జిల్లా వ్యాప్తంగా పోలీసు పెట్రోలింగ్, వాహన తనిఖీలు కొనసాగుతున్న అందరి కళ్లుకప్పి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

మహారాష్ట్ర సరిహద్దుతో..

జిల్లాలోని సగానికి పైగా మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. కాగజ్‌నగర్, సిర్పూర్(టి), రెబ్బెన నుంచి రైలు మార్గాలు కూడా ఉండటంతో రాకపోకలు సులువుగా మారుతున్నాయి. కొత్తగా చింతలమానెపల్లి గూడెం వంతెన కూడా అందుబాటులోకి వచ్చింది. అలాగే ప్రాణహిత, పెన్‌గంగ మీదుగా పడవ ప్రయాణాలు కూడా సాగుతుంటాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి వస్తున్న దొంగలే వరుస చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. సొత్తు కొల్లగొట్టిన వెంటనే వారు సరిహద్దు దాటుతుండటంతో పోలీసులకు కేసుల దర్యాప్తు కష్టంగా మారుతోంది. ఇప్పటికే సిర్పూర్(టి) మండలానికి సరిహద్దున పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు.

ఊరెళ్తే సమాచారం ఇవ్వండి



ప్రజలు పనుల మీద ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇళ్లకు తాళం వేసి ఎక్కువ రోజులు వెళ్తే దొంగలకు సులువుగా టార్గెట్‌గా మారుతుంది. ఇంట్లో విలువైన వస్తువులు, బంగారం, ఆభరణాలు, ఎక్కువ మొత్తంగా నగదు ఉంచుకోవద్దు. ప్రతీ గ్రామంలో సమష్టిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. – సాదిక్ పాషా, సీఐ, కౌటాల

పట్టణ సుందరీకరణకు సమష్టి కృషి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రం సుందరీకరణకు అధికారులు, ప్రజల సమష్టి కృషి అవసరమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్డీవో సురేందర్‌తో కలిసి దుకాణ సముదాయాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని కుమురంభీం చౌక్ నుంచి ఫారెస్టు చెక్‌పోస్టు వరకు రహదారికిరువైపులా దుకాణాల ఎదుట మొక్కలు నాటాలన్నారు. మొక్కల సంరక్షణను ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. బుధవారం నుంచి చేపట్టనున్న క్షేత్రస్థాయి సర్వేలో భాగంగా దుకాణ సముదాయాల యజమానుల కోరిక మేరకు ఆసిఫాబాద్ పంచాయతీ పరిధిలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. మొక్కలు నాటే సమయంలోనే విద్యుత్ తీగల కింద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, దుకాణాల యజమానులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

అభ్యసన ఆహ్లాదకరంగా ఉండాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): విద్యార్థుల అభ్యసన ఆహ్లాదకరంగా ఉండాలని ఎస్‌సీఈఆర్‌టీ స్కూల్స్ లీడర్‌షిప్ అకాడమీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్‌బాబు అన్నారు. జాయ్‌ఫుల్ లర్నింగ్ సెంటర్(సమ్మర్ క్యాంపు)ను బుధవారం వంకులం పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ఇంగ్లిష్‌లో మాట్లాడటం, మంచి ఉచ్ఛరణతో చదవడం, ఉపన్యాసాలు నేర్చుకోవటంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఆహ్లాదకరంగా కథలు చెప్పడం, రోల్ ప్లేస్, నాటికలు, అభినయ గేయాలు, డ్రాయింగ్, ఎక్కాలు, జనరల్ నాలెడ్జ్, డ్యాన్స్ వంటి అనేక అంశాలను నేర్పుతున్న రాజకమలాకర్‌రెడ్డిని అభినందించారు. డాన్స్ మాస్టర్ రాజ్‌కుమార్, హెచ్ఎం జాడి ప్రభాకర్ ప్రోత్సాహం ఇదే తరహాలో ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ప్రధానోపాధ్యాయుడు జాడి ప్రభాకర్, ఎస్ఎంసీ చైర్మన్ ప్రకాశ్, శిరీష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సురేశ్‌బాబు

సమస్యలు పరిష్కరించాలని వీవోఏల వినతి


ఆసిఫాబాద్‌అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వీవోఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీవోఏల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు లోకేశ్, షైమా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

నిరుపేదలు నిరాశ చెందవద్దు

బెజ్జూర్(సిర్పూర్): ఇళ్లు లేని నిరుపేదలు నిరాశ చెందవద్దని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి- గడపగడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా బుధవారం బెజ్జూర్ మండలంలోని కాటేపల్లి, పోతేపల్లి, అంబగట్టు, కుకుడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు పాల్వాయికి తిలకం దిద్ది స్వాగతం పలికారు. హరీశ్‌బాబు మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు. కేసీఆర్ విధానాలతో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన తెలంగాణలో అమలు కావడం లేదన్నారు.



హరీశ్‌బాబుకు తిలకం దిద్దుతున్న మహిళలు

క్లుప్తంగా

పీవో సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



పీవోను సన్మానిస్తున్న ఎస్వోటూ జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్‌గా పనిచేసిన ఆయనను యాజమాన్యం కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేసింది. ఎస్వోటూ జీఎం కేహెచ్ఎస్ గుప్తా, పీవో ఉమాకాంత్, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు, అదనపు మేనేజర్ మధుసూదన్, డీవైపీఎం నాగుల వేణు, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశం ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణి ఇసుక క్వారీ తనిఖీ



తనిఖీ చేస్తున్న చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్

చెన్నూర్: పట్టణంలోని గోదావరినదిలో ఉన్న సింగరేణి ఇసుక క్వారీని బుధవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హనుమంతరావు తనిఖీ చేశారు. క్వారీలో ఇసుక లిఫ్టింగ్ ప్రదేశాలు, సీసీ కెమెరాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణే సెక్యూరిటీ విభాగం లక్ష్యమన్నారు. ప్రతి సెక్యూరిటీ ఆఫీసర్ సింగరేణి ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కంపెనీ ఆస్తులు కాపాడడంలో సెక్యూరిటీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన వెంట సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఇన్‌స్పెక్టర్ అజీమొద్దీన్ ఉన్నారు.

ఇళ్లస్థలాలు సాధించే వరకూ ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

చెన్నూర్‌రూరల్: ఇళ్లస్థలాలు సాధించే వరకు ఉద్యమిద్దామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మండలంలోని బావురావుపేట గ్రామ శివారులోని అసైన్డ్ భూములను పేదలకు ఇవ్వాలని చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఎండీ అవేజ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఇళ్ల స్థలాల కోసం నిరుపేద మహిళలు చేస్తున్న పోరాటం ఆగదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, దాసరి రాజేశ్వరి, చందు, అవేజ్ పాల్గొన్నారు.

వేసవి సీజన్.. ఆదాయ మార్గం

- మామిడి కోత పనుల్లో విద్యార్థులు
- రోజుకు రూ.400 నుంచి రూ.600 కూలి
- విద్యావసరాల కోసం సంపాదన

సెలవులు వచ్చాయంటే మామూలుగా ఎవరైనా విద్యార్థులు సరదాగా బంధువుల ఇంటికి వెళ్దామా? ఎక్కడికైనా టూర్‌కు వెళ్దామా? ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాకు వెళ్దామా? అని ఆలోచిస్తారు. ప్రస్తుతం వేసవికాలంలో మండుతున్న ఎండలకు కొంతమంది ఇంటివద్దే కాలక్షేపం చేస్తారు. మరి కొంతమంది విహారయాత్రల పేరుతో వేసవి సెలవులు ముగించేస్తారు. కానీ జిల్లాలోని పలువురు విద్యార్థులు వేసవి సెలవుల్లో సరదాగా మామిడికోతలకు వెళ్తూ తమ అవసరాలకు డబ్బులు సంపాదించుకుంటున్నారు.



మామిడితోటలో కాయలు కోస్తున్న విద్యార్థులు

ఏటా వెళ్తున్నా...



ఇలా కష్టపడి పని చేయడం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి కష్టాన్నయినా తట్టుకోగలమని అనిపిస్తుంది. తల్లిదండ్రులపై భారం పడకుండా ఉండేందుకు ఏటా వేసవి సెలవుల్లో మామిడి కాయలు కోసే పనికి వెళ్తున్నా. వచ్చిన డబ్బులను విద్యావసరాల కోసం వినియోగిస్తున్నా. – కాట్న శ్రీకాంత్, డిగ్రీ విద్యార్థి, గంగారం

పరీక్షలు ముగియగానే..



ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశా. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే మామిడి కాయలు కోసే పనికి వెళ్తున్నా. మాది నిరుపేద గిరిజన కుటుంబం. అమ్మానాన్నలపై భారం పడకుండా ఇంటర్ చదువు కోసం డబ్బులు పనికి వస్తాయని స్నేహితులతో కలిసి పనికి వెళ్తున్నా. రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు వస్తున్నాయి. – గోగుల విశాల్, పదోతరగతి విద్యార్థి, చిత్తాపూర్

ఆర్థిక ఇబ్బందులతో...



మాది నిరుపేద గిరిజన కుటుంబం. ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశా. మా తల్లిదండ్రులపై భారం పడకుండా వారికి ఆసరాగా ఉండేందుకు సెలవుల్లో ఈ పనిని ఎంచుకున్నా. మామిడి కాయలు కోసేందుకు వెళ్లగా వచ్చిన డబ్బులతో పుస్తకాలు, బట్టలు, ఫీజులు వంటి అవసరాలు తీర్చుకుంటున్నా. – తొడిసెం సంజయ్, ఇంటర్ విద్యార్థి, కొత్తూర్

నెన్నెల(బెల్లంపల్లి): జిల్లాలో 20 వేల ఎకరాల్లో మామిడితోటలు సాగవుతున్నాయి. వేసవికాలంలో ఏప్రిల్, మే మాసంలోనే మామిడికోతలు ప్రారంభమవుతాయి. ఇదే సమయంలోనే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటిస్తారు. జిల్లాలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ వరకు చదివిన పేద, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు వేసవి సెలవుల్లో మామిడితోటల్లో కాయలు కోసే పనిని ఎంచుకున్నారు. వేసవి సెలవులను వృథా చేయకుండా తమ చదువుకు కావాల్సిన డబ్బులను తామే సంపాదించుకుంటున్నారు. స్నేహితులంతా కలిసి ఆడుతూ, పాడుతూ పనులు చేస్తూ కాలక్షేపంతో పాటు డబ్బులు సంపాదిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. రోజుకు రూ.400 నుంచి రూ.600 వరకు సంపాదిస్తున్నారు. నీడపట్టున పనిచేసి తమ అవసరాలకు డబ్బులు సంపాదించుకోవాలని ఈ పనులు చేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. తోటల్లో మామిడికాయలు కోస్తున్న కొంతమంది విద్యార్థులను 'సాక్షి' పలకరించింది.

'నవోదయ'లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాగజ్‌నగర్ విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. పదోతరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 22న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9 విద్యాలయాల్లో ఎంపీసీ, బైపీసీ, కామర్స్ కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ, రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

ప్రశాంతంగా ఎంజేపీ బ్యాక్‌లాగ్ సెట్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న శ్రీధర్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బుధవారం నిర్వహించిన బ్యాక్‌లాగ్ సెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,613 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,435 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంజేపీ జిల్లా కన్వీనర్ శ్రీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏడు పరీక్షా కేంద్రాలను జిల్లా అబ్జర్వర్ తిరుపతిరెడ్డితో కలిసి పరిశీలించారు.

కార్పొరేట్ కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: ఈ విద్యాసంవత్సరానికిగానూ రెప్యూటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పి.రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి రెప్యూటెడ్ జూనియర్ కళాశాలలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రెసిడెన్షియల్ వసతి, విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు కలిగి, కాంపిటేటివ్ పరీక్షల్లో అధికసంఖ్యలో ఉత్తీర్ణత శాతం కలిగిన రెప్యూటెడ్ జూనియర్ కళాశాలలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గలవారు తమ కళాశాలల ఐదు సంవత్సరాలకు సంబంధించిన అకాడమిక్ ప్రొఫైల్‌తో పాటు ఈపాస్ వెబ్‌సైట్ http://telangana epass.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో కళాశాలల ఈపాస్, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి ఈ నెల 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కళాశాలలు బీ.ఐ.ఈ అనుబంధ ధృవీకరణ పత్రం, భవనం, వసతి గృహ వివరాలు, తరగతి గదులు, డార్మిటరీ, వసతి గృహాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వివరాలు, అకాడమిక్ రికార్డు, ఉత్తీర్ణత 90 శాతం, మొదటి శ్రేణిలో 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన కళాశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి ప్రభుత్వం ట్యూషన్ ఫీజు కింద రూ.35 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.3 వేలు ఏటా మంజూరు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి'



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వీవోఏలు

పాతమంచిర్యాల: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కుంటాల కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏల ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్ ప్రకటించారు. 11న ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేత, 12న ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రులకు ఉత్తరాలు రాయడం, 14న వీవోఏల కుటుంబ సభ్యులచే నిరసన కార్యక్రమాలు, 15, 16 తేదీల్లో ఏపీఎం కార్యాలయాల ఎదుట సామూహిక దీక్షలు, 18న ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా, ర్యాలీ, 21న డివిజన్ కేంద్రాల్లో బతుకమ్మ ఆటలు, రాత్రి బస, 22న కలెక్టరేట్‌ను ముట్టడించాలని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం రాములు, గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి వెంకటేశ్, కోశాధికారి పొట్ట పోషం, ఉపాధ్యక్షులు రజిత, రమాదేవి, అనిత, సహాయ కార్యదర్శి పి.మహేష్, సలహాదారు జుమ్మిడి లక్ష్మణదాసు పాల్గొన్నారు.

జన్నారంలో భారీ వర్షం



చెట్టును పక్కకు తీస్తున్న యువకులు

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అరగంట పాటు బలమైన గాలులు వీయడతో జన్నారం నుంచి కలమడుగుకు వెళ్లే రోడ్డు పక్కనున్న పలు చెట్లు విరిగిపడ్డాయి. రోడ్డుపై వెళ్లే యువకులు చెట్లను రోడ్డు పై నుంచి తొలగించారు. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు.

గొర్రెల యూనిట్లు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారి

నెన్నెల: గొర్రెల పెంపకందారులు రెండోవిడత గొర్రెల యూనిట్లు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ వై.రమేశ్‌కుమార్ అన్నారు. బుధవారం చిత్తాపూర్ రైతు వేదికలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు తమవాటా రూ.43,750 డీడీ తీయాలని సూచించారు. ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాలు జత చేసిన దరఖాస్తులను పశువైద్యాధికారులకు అందించి ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రతిపాదించిన జిల్లా అధికారితో లబ్ధిదారులు వెళ్లి గొర్రెలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వాటాదనం నేరుగా లబ్ధిదారుల ఖాతా నుంచి కలెక్టర్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని పద్మ, సహాయ సంచాలకులు శంకర్, పశువైద్యాధికారి దిలీప్, గొల్లకుర్మలు పాల్గొన్నారు.

సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ గడువు పెంపు

- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ గడువును జూన్ 30 వరకు పొడిగించినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవితో కలిసి బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్ మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవో 76 కింద ఇప్పటి వరకు 10,890 దరఖాస్తులు రాగా 9,400 మంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుము చెల్లించారన్నారు. గడువు పొడగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవో 59 కింద అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు గడువును పొడిగించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు

- సత్తా చాటిన జ్యోతిబాపూలే, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు



ఎన్.వైష్ణవి, 10 జీపీఏ



ఆర్.స్నేహారిక, 9.8

మంచిర్యాలటౌన్: జిల్లాలోని సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల్లోని విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. బెల్లంపల్లి బాలికల, చెన్నూరు బాలుర మైనార్టీ గురుకులంలో వందశాతం, లక్సెట్టిపేట్‌లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు ఒకరు 10 జీపీఏ సాధించారు. చెన్నూరు బాలుర గురుకులంలో వందశాతం ఉత్తీర్ణతతో పాటు ఇద్దరు 10 జీపీఏ సాధించారు. తాండూరు బాలుర గురుకులంలో 99 శాతం, గుడిపేట బాలుర గురుకులంలో 92 శాతం, బెల్లంపల్లి బాలికల గురుకులంలో వందశాతం, ఒకరు 10 జీపీఏ, మందమర్రి బాలికల గురుకులంలో 96 శాతం, ఒకరు 10 జీపీఏ, మంచిర్యాల బాలికల పాఠశాల 95 శాతం సాధించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో లక్సెట్టిపేట్ బాలికల, జైపూర్ బాలుర, బెల్లంపల్లి బాలికల, బెల్లంపల్లి సీవోఈ బాలుర, కోటపల్లి బాలుర గురుకులాలు 100 శాతం, చెన్నూరు బాలికలు 99 శాతం, కాసిపేట్ బాలురు 97 శాతం, మందమర్రి బాలికలు 97 శాతం, మంచిర్యాల బాలుర గురుకులం 90 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

'బోడగుట్ట' ఘటనలో ఎనిమిది మందిపై కేసు

భైంసాటౌన్: భైంసాలోని బోడగుట్టపై ఇటీవల హనుమాన్ విగ్రహం వెలుగు చూసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భైంసా మండలం బిజ్జూర్ గ్రామానికి చెందిన బద్దం భోజారెడ్డి అనే వ్యక్తి తన వద్ద పనిచేసే కళ్యాణ్ పాండురంగ, వేణుగోపాల్, ఆనంద్, జాదవ్ సతీష్, యోగేశ్, సూదుల సాయినాథ్, కాసరం సంతోష్ సాయంతో గుట్టపైకి హనుమాన్ విగ్రహం తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాజకీయంగా లబ్ధి కోసమే కలలో దేవుడు కనిపించాడంటూ ప్రజలను తప్పుదోవ పట్టించాడని తెలిపారు.

టేకు చెట్లు నరికిన నలుగురిపై కేసు

పెంబి: పెంబి రేంజ్ పరిధిలోని తాటిగూడ సెక్షన్, పుల్గంపాండ్రిలో గుండాల గ్రామానికి చెందిన షేక్ మసుద్, షేక్ ఖాజీం, అశోక్, ప్రశాంత్ అనే నలుగురు పది రోజుల క్రితం దాదాపుగా 22 చెట్లు అక్కడే ఉన్న బేస్ క్యాంపు సిబ్బంది సహాయంతో నరికారు. అధికారులు బేస్ క్యాంపు సిబ్బందిని విచారించగా గుండాల గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు నరికినట్లు తెలిపారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో రామకృష్ణ తెలిపారు. నరికిన టేకు చెట్ల విలువ రూ.3లక్షల 36వేలు ఉంటుందన్నారు. ఇందులో ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కాలనీలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు అన్నారు. బుధవారం సీతారాంపల్లిలోని ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ పని చేయక నాలుగు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఫిల్టర్‌కాని నీరు తాగి ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అగల్‌డ్యూటీ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, నాయకులు మిట్టపల్లి మొగిలి, అడిచెర్ల రూపాదేవి, తిప్పని భీమయ్య, రావుల లక్ష్మణ్, కొంతం మహేందర్, తరాల విజయ్, నారగోని సతీశ్, రాజు పాల్గొన్నారు.

'బెల్లంపల్లికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు'

బెల్లంపల్లి: రాష్ట్రాన్ని పాలిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం బెల్లంపల్లి అభివృద్ధికి చేసిందేమీ లేదని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మత్తమారి సూరిబాబు విమర్శించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా కొత్తగా ఏమీ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను తాము చేసినట్లు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బెల్లంపల్లిలో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. తాగునీటి ఎద్దడితో పురప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రూ.18 కోట్లతో ప్రారంభించిన గోదారి నీటి పథకాన్ని దూరం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. 2017లో బెల్లంపల్లిలో నిర్మాణం తలపెట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్లు నేటికీ పూర్తి కాలేదని, ఇదేనా ప్రగతి అని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నాయకులు దర్జాగా భూ కబ్జాలకు పాల్పడుతూ ప్రభుత్వ భూములు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి అఫ్జల్, గెల్లి జయరాం, మల్లారపు చిన్నరాజం, బైరి శ్రీనివాస్, మధునయ్య పాల్గొన్నారు.

టీకాల కార్యక్రమం పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల, నంనూర్, హాజీపూర్ గ్రామాల్లోని పల్లె దవాఖానాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ పనితీరును బుధవారం మంచిర్యాల డివిజన్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల బృందం పరిశీలించింది. 12 వారాల లోపే గర్భిణుల రిజిస్ట్రేషన్ పూర్తిచేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణకు ప్రతిఒక్కరూ నెలకు పది తెమడ నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపాలన్నారు. మలేరియా నిర్ధారణ కోసం జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. హెచ్ఈఓ రఘుపతి, సూపర్‌వైజర్ జయమణి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 63 బాధితుల దీక్ష కొనసాగింపు



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సురేఖ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల-ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి 63 బాధితుల దీక్ష కొనసాగుతోంది. వేంపల్లి-ముల్కల్ల శివారులో దీక్షా శిబిరం ఏర్పాటు చేసి న్యాయం కోసం పోరు సాగిస్తున్నారు. రహదారి విస్తరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా, తమ అనుమతులు లేకుండా మా భూముల్లో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. పరిహారం విషయంలో కూడా స్పష్టత ఇచ్చాకే సర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బుధవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, నాతరి శ్రీనివాస్ ఎంపీ వెంకటేశ్‌నేతను కలిసి వినతిపత్రం అందజేశారు.

మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఆసిఫాబాద్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని చిలాటిగూడకు చెందిన చౌదరి ఏమాజి (28) హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవపడుతుండేవాడు. మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంట్లోని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శారద ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



దండేపల్లి(మంచిర్యాల): ఎడారి ఓడగా పిలుచుకునే ఒంటెలు బుధవారం దండేపల్లిలోని రోడ్లపై కనిపించాయి. రాజస్థాన్‌కు చెందిన పలువురు గొర్రెల కాపర్లు గొర్రెలను మేపుకుంటూ వలస వచ్చారు. వారి సామగ్రిని ఒంటెలపై పెట్టుకుని వెళ్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.